క్లుప్తంగా

నాలుగు కంపెనీల కేంద్ర బలగాల రాక : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీధర్

పి.గన్నవరం: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాకు ప్రస్తుతం నాలుగు కంపెనీల కేంద్ర బలగాలు వచ్చాయని జిల్లా ఎస్పీ శ్రీధర్ వెల్లడించారు. జిల్లా కేంద్రమైన అమలాపురం, రావులపాలెం, మండపేట, పి.గన్నవరంలో కేంద్ర బలగాలు ఉండేలా ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. పి.గన్నవరానికి వచ్చిన 90 మంది బృందానికి గురువారం స్థానిక కోకోనట్ మర్చంట్స్ కల్యాణ మంటపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల్లో విశ్వాసాన్ని నెలకొల్పేలా కేంద్ర బలగాల సేవలను వినియోగిస్తామన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలు ముగిసే వరకూ కేంద్ర బలగాలు ఇక్కడే ఉంటాయని చెప్పారు. అనంతరం మూడు రోడ్ల సెంటర్ వరకూ మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ట్రైనీ ఐపీఎస్ రోహిత్ కుమార్‌చౌదరి, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ తేజస్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి సాయం

మలికిపురం: రాజోలు మండలం పొన్నమండ గ్రామానికి చెందిన 13 ఏళ్ల బల్ల రామ్ యోచన్ కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. కిడ్నీ మార్పిడికి సుమారు రూ.15 లక్షలు అవసరం. వసుధ ఫౌండేషన్ ప్రతినిధులు జంపన బుజ్జిరాజు, బోనం రాజు ద్వారా సంస్థ చైర్మన్ మంతెన వెంకటరామరాజుకు దరకాస్తు చేసుకోగా, రూ.50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మొత్తాన్ని గురువారం రామ్ యోచన్ తండ్రికి మలికిపురంలో అందించారు.

ప్రాధాన్యమివ్వండి : చంటి

అయినవిల్లి: పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా టిక్కెట్ తనకు ఇవ్వాలని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మద్దా చంటిబాబు కోరారు. గురువారం జనసేన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా టిక్కెట్ ఇస్తే.. తనకు ప్రాధాన్యమివ్వాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కోరినట్టు తెలిపారు.

పీఓలకు శిక్షణ

కొత్తపేట: రానున్న ఎన్నికల పోలింగ్ నిర్వహణపై పీఓలకు గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌డీఓ, నియోజకవర్గ ఈఆర్‌ఓ జీవీవీ సత్యనారాయణ పలు అంశాలపై అవగాహన కల్పించారు. నియోజకవర్గంలో 4 మండలాల తహసీల్దార్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మలికిపురం: మలికిపురం డిగ్రీ కళాశాలలో జరుగుతున్న పోలింగ్ సిబ్బంది శిక్షణా తరగతులను గురువారం జేసీ నుపూర్ సందర్శించారు. ఈవీఎంలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ శివ శంకర ప్రసాద్, తహసీల్దార్లు, ఎంఈఓ పాల్గొన్నారు.

నామన ఫౌండేషన్ సేవలు

మామిడికుదురు: నామన ఫౌండేషన్ ద్వారా ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి సేవలందిస్తామని జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు తెలిపారు. మగటపల్లిలో నామన ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం 200 మంది పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఇద్దరు యువతులకు రూ.50 వేల విలువైన బంగారు చెవి కమ్మలను అందించారు. అమ్మ ఫౌండేషన్ ద్వారా ఏడాది నుంచి అమెరికాలో సేవలందిస్తున్నామని ఎన్నారై ఎండీ కార్డియాలజీ వైద్యుడు నామన వినోద్, ఎండీ జనరల్ మెడిసిన్ నామన శృతి తెలిపారు.

సమాజంలో మహిళలకు సముచిత స్థానం

అంబాజీపేట: ప్రస్తుత సమాజంలో మహిళలకు సముచిత స్థానం కల్పించారని, అన్ని రంగాల్లో పురుషులతో పోటీ పడి మరీ రాణిస్తున్నారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో అత్యధిక ప్రాముఖ్యత ఇస్తోందన్నారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.మమతను ఘనంగా సత్కరించారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ బి.చంద్రమోహన్ పాల్గొన్నారు.

వినికిడి యంత్రానికి సాయం

రావులపాలెం: వినికిడి సమస్యతో బాధపడుతున్న బాలుడికి స్థానిక అక్షయ సేవా సంస్థ సభ్యులు రూ.12 వేల సాయాన్ని గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన తెలగరెడ్డి ఆదిత్య నాగగౌతమ్ అనే బాలుడు వినికిడి సమస్యతో బాధపడుతున్నాడు. పేదలైన తల్లిదండ్రులు చెవిటి మెషీన్ కోసం సాయం కోరడంతో సంస్థ సభ్యులు సాయం అందజేశారు.

ఐరన్ సిరప్ అందజేత

ఆలమూరు: మండలంలోని 39 ఎంపీపీ పాఠశాలల్లో, 76 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, విద్యార్థులకు గురువారం వీక్లీ ఐరన్ సిరప్, మాత్రల పంపిణీ జరిగింది. పెదపళ్ల, చొప్పెల్ల వైద్యాధికారులు డి.సువర్చలా నాయుడు, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఈ డ్రాప్స్‌ను అందజేశారు.

ఆమెతోనే ప్రగతి

- అన్నింటా అగ్రభాగం మహిళలదే..
- స్వయం సాధికారత దిశగా ముందుకు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం





మామిడికుదురు: మహిళలు అన్ని రంగాల్లోను ప్రగతి పథంలో పయనించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం వారికి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. అన్నింటా వారికే అగ్రపీఠమేస్తోంది. గ్రామ సచివాలయ ఉద్యోగాలతో పాటు, వలంటీర్ల నియామకంలోను పురుషుల కన్నా మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఉద్యోగాలతో పాటు, నామినేటెడ్ పదవుల్లో సైతం మహిళలకు సింహభాగం కల్పిస్తూ మహిళా సాధికారత దిశగా ముందుకు వెళ్తోంది. ఎంతో కష్టపడి చదువుకున్న మహిళలు నేడు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ, అటు అధికారులు, ఇటు ప్రజల ప్రశంసలందుకుంటున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలు శాఖల ఉద్యోగుల అభిప్రాయాలివి..

విలేజ్ హెల్త్ సెక్రటరీగా..



కొమరాడ గ్రామానికి చెందిన నా పేరు యల్లమెల్లి లావణ్య. నిరుపేద కుటుంబానికి చెందిన నేను ప్రస్తుతం స్వగ్రామంలోనే గ్రామ సచివాలయం విలేజ్ హెల్త్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నా. నాన్న సత్యనారాయణ వ్యవసాయ కూలీ. ఆయనకు నలుగురు అమ్మాయిలం. అమ్మ సత్యవతి గృహిణి, నా కుటుంబ సభ్యులు ఎంతో కష్టపడి నన్ను చదివించారు. నా భర్త శ్రీనుబాబు సహకారంతో గ్రామ సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత 2019 నవంబరులో నాకు ఏఎన్‌ఎంగా ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం మేమంతా ఎంతో హ్యాపీగా ఉన్నాం.

గ్రేడ్-5 కార్యదర్శిగా రాణిస్తూ..



పి.గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన నా పేరు బండారి లక్ష్మీ లావణ్య. పెదపట్నంలంక గ్రామ సచివాలయం-2 గ్రేడు-5 పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నాను. నాన్నగారు వెంకట మహాలక్ష్మి చిరుద్యోగి. అమ్మ అనురాధ. తమ్ముడు సూర్య చదువుకుంటున్నాడు. నాన్న ఎంతో కష్టపడి నన్ను చదివించారు. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత నాకు ఉద్యోగం వచ్చింది. నా భర్త భద్ర నన్ను అడుగడుగునా ప్రోత్సహిస్తున్నారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా..



రాజోలు మండలం కాట్రేనిపాడు గ్రామానికి చెందిన నా పేరు పొన్నమండ శ్రీలక్ష్మి. మామిడికుదురు గ్రామ సచివాలయం-1లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ)గా విధులు నిర్వహిస్తున్నాను. నాన్న పొన్నమండ వెంకటేశ్వర్లు కుల వృత్తి చేస్తారు. అమ్మ మంగతాయారు గృహిణి, నా భర్త రాజ్‌కుమార్ వలంటీర్‌గా పని చేస్తున్నారు. నా కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో నేను వీఏఏగా విధులు నిర్వహిస్తున్నాను. పేద కుటుంబానికి చెందిన మాకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో అండగా నిలిచింది.

సచివాలయంలో మహిళా పోలీస్



రాజోలు మండలం పొన్నమండ గ్రామానికి చెందిన నా పేరు తెల్లాకుల శ్రావణి. పాశర్లపూడిలంక గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్నాను. మా నాన్నగారు భాస్కరరావు, అమ్మ లక్ష్మి గృహిణి. అన్నయ్య హరికిరణ్. మమ్మల్ని మా అమ్మ, నాన్న ఎంతో కష్టపడి చదివించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా 2019 నవంబర్ 8న నాకు మహిళా పోలీస్‌గా ఉద్యోగం వచ్చింది. మహిళలు అన్ని రంగాల్లోను పురుషుల కన్నా దీటుగా రాణించడం చాలా ఆనందంగా ఉంది.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



చెముడులంకలో సీఎం జగన్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

ఆలమూరు: వైఎస్సార్ చేయూత నాలుగో విడత నిధులను అనకాపల్లి వేదికగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన సందర్భంగా మహిళలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. చెముడులంకలో సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం చేరుకుని ఆ కార్యక్రమాన్ని ప్రత్యేక స్క్రీన్‌పై తిలకించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒక్కొక్క మహిళకు నాలుగు విడతల్లో రూ.75 వేలు అందించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌ను సీఎంగా, జగ్గిరెడ్డిని ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించుకుంటామంటూ నినాదాలు చేశారు. అనంతరం సీఎం జగన్, కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పంచాయతీ కార్యదర్శి యు.రేణుక, ఉప సర్పంచ్ దొండపాటి చంటి, తమ్మన హరికృష్ణ, అడబాల వీర్రాజు, బుడ్డిగ వీరవెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: పేదల సొంతింటి కల నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణీ కార్యక్రమం చేపట్టిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 1,557 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లల్లో నిర్వహించడం ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీలు రాపాక దీవెన కుమారి, రుద్రరాజు చినరాజా, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, సర్పంచ్‌లు గొల్లమందల చిట్టిబాబు, దెందుకూరి శ్రీహరిరాజు, ఓగూరి రత్నకుమారి, కట్టా ఉమా మహేశ్వరరావు, ఎంపీటీసీలు మందపాటి రత్నం, నల్లి రత్నకుమార్, యెనుముల కొండమ్మ, కొల్లాబత్తుల శుభాకర్, మహిళా అధ్యక్షురాలు మొల్లేటి మహేశ్వరి, ఎంపీడీఓ పీవీ సత్యనారాయణ, తహసీల్దారు జి.పెద్దిరాజు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ భరోసా

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ఆర్థిక భరోసా లభించిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. కేశనపల్లిలో రూ 21.80 లక్షల ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాన్ని ఎమ్మెల్యే రాపాక గురువారం ప్రారంభించారు. అలాగే సుమారు రూ.23 లక్షలతో ఎడ్ల తాతయ్య గ్రూపునకు నిర్మించిన సీసీ రోడ్డునూ ఆయన ప్రారంభించారు. కేశనపల్లి జెడ్పీ హైస్కూల్లో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి భవనాలను, గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలన్నీ మారిపోయాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్య అందుతోందన్నారు. ఇది కేవలం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల బ్రహ్మాజీరావు, ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, సర్పంచ్ యెనుముల నాగు, ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణ స్వామి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, ఏఎంసీ ఉపాధ్యక్షులు సుంకర బాబ్జి, గుండుమేను నారాయణమూర్తి, కందుల విజయ కుమార్, యడ్ల జయకృష్ణ, యర్రంశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు నిధులు రూ.4.39 కోట్లతో రోడ్ల ఆధునీకరణ

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



కొత్తపాలెంలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: నియోజకవర్గంలో అభివృద్ధికి నోచుకోని 15.45 కి.మీ. మేర పది పంచాయతీరాజ్ రోడ్లను నాబార్డు నిధులు రూ.4.39 కోట్లతో ఆధునీకరిస్తున్నట్టు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. అమలాపురం ప్రధాన కాలువ నుంచి కొత్తపేట శివారు, బిళ్లకుర్రు శివారు కొత్తపాలెం వరకూ 1.88 కి.మీ. పీఆర్ రోడ్డు ఆధునీకరణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపర్చాలనే సంకల్పంతో నవరత్నాలతో పాటు అనేక వినూత్న పథకాలను అమలు చేస్తోందన్నారు. అనంతరం జగ్గిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో దాదాపు అన్ని ఆర్‌అండ్‌బీ రోడ్లు ఆధునీకరించామన్నారు. పీఆర్ పరిధిలో పలు రోడ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిధులు మంజూరు చేయించి, టెండర్ల ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. వీటిలో నాబార్డు నిధులు రూ.79.3 లక్షలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, జీజీఎంపీ నిధులు రూ.30 లక్షలతో కొత్తపేట శివారు చినగూళ్లపాలెం రోడ్డు, నాబార్డు నిధులు రూ.40 లక్షలతో ఆత్రేయపురం మండలం వద్దిపర్రు రోడ్డు, రూ.25 లక్షలతో రావులపాలెం మండలం దేవరపల్లి-మట్లదొడ్డి రోడ్డు, రూ.35 లక్షలతో దేవరపల్లి-పూజారిపాలెం వయా కొత్తపాలెం రోడ్డు, రూ.30 లక్షలతో గోపాలపురం-జనిపిరెడ్డివారిపాలెం రోడ్డు, రూ.25 లక్షలతో జుత్తుగపాడు ఫెర్రీ రోడ్డు, రూ.20 లక్షలతో వెదిరేశ్వరం ఎస్సీ, ఎస్టీ, రజకపేట రోడ్డు, రూ.35 లక్షలతో ఆలమూరు-పెనికేరు రోడ్డు, రూ. కోటితో మడికి రోడ్డు టెండర్లు పూర్తయినట్టు తెలిపారు. అత్యవసర వర్కుల కింద రూ.70 లక్షలతో ఖండ్రిగ రోడ్డు, రూ.65 లక్షలతో పలివెల శివారు పూజారిపాలెం నుంచి ఈతకోట-గంటి ఆర్‌అండ్‌బీ మధ్య రోడ్డు, రూ.70 లక్షలతో దేవరపల్లి-పూజారిపాలెం రోడ్డు, రూ.40 లక్షలతో వాడపల్లి బీసీ ఏరియా రోడ్డు నిర్మిస్తున్నట్టు వివరించారు. అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, సర్పంచ్‌లు నెల్లి లక్ష్మీపతిరావు, రెడ్డి చంటి, వైస్ ఎంపీపీ దంగేటి వెంకటనాగమణి, ఎంపీటీసీ బొక్కా నాగరాణి, పంచాయతీ సభ్యుడు బొక్కా లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే విజయ బావుటా



మాచవరంలో కాశీ అన్నపూర్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వేణుగోపాలరావు తదితరులు

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మాచవరంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఆయన ఆశయాల్ని ఆదర్శంగా తీసుకుని నిరంతర సేవా కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లాలన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సంక్షేమ సారథి సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేలా అందరూ కృషి చేయాలన్నారు. ఐక్యతతో ముందుకు సాగి విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు మాచవరం శివారు కుడుపూడి వారిపాలెంలో ఇటీవల మృతి చెందిన కుడుపూడి కాశీ అన్నపూర్ణ కుటుంబ సభ్యులను ఇన్‌చార్జి వేణుగోపాలరావు పరామర్శించారు. ఆమె చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, చింతపల్లి వెంకటేశ్వరరావు, కుడుపూడి సత్తిబాబు, నందెపు సూరిబాబు, మట్టపర్తి హరి, ఉందుర్తి నాగబాబు, వాసంశెట్టి వెంకన్న, మట్టా వెంకటేశ్వరరావు, మట్టపర్తి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

30 లక్షల ఇళ్ల పట్టాలతో జగన్ చరిత్ర

జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్యే చిట్టిబాబు



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందించి చరిత్ర సృష్టించారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. రాజులపాలెం గ్రామంలో 75 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను గురువారం అందజేశారు. సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు అధ్యక్షత వహించారు. సొసైటీ చైర్మన్ మెల్లం మహలక్ష్మి ప్రసాద్, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, నక్కా గోపి, గుత్తుల మధు, కొంబత్తుల శేఖర్, అడ్డగళ్ల శ్రీను, పుచ్చకాయల ఏసు, దొమ్మేటి సూర్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అనారోగ్యానికి గురై కోలుకుంటున్న పేదలను ప్రభుత్వం ఆదుకుంటోందని విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. నియోజకవర్గంలోని 37 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.23.02 లక్షలను చెక్కుల రూపంలో స్థానిక పార్టీ కార్యాలయంలో అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. విప్పర్తి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగన్‌ను అందరూ ఆశీర్వదించాలని కోరారు. అంబాజీపేట మండల అధ్యక్షుడు విత్తనాల శేఖర్, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, శృంగవరపు లక్ష్మణరావు, కొంబత్తుల ఏసుబాబు, నూకపెయ్యి ప్రసన్నకుమార్, రాష్ట్ర నాయకులు దొమ్మేటి వెంకటశివ రామన్, పితాని నర్సింహరావు, జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, దాసరి కాశీ, నర్సింహమూర్తి, చిట్టాల ఆర్యశ్రీను, రవికుమార్, రవిచంద్ర, రాజేంద్రప్రసాద్, శ్రీను, ఏడుకొండలు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 117 మందికి ఉద్యోగాలు



జాబ్ మేళాకు హాజరైన యువతకు సూచనలిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

పి.గన్నవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. స్థానిక లక్ష్మి ఐటీఐ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. సంస్థ జిల్లా మేనేజర్ పి.లోక్‌మాన్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈ జాబ్‌మేళాలో 15 కంపెనీలు పాల్గొన్నాయి. 346 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 117 మందికి ఉద్యోగాలు లభించాయి. రెండో రౌండ్ ఇంటర్వ్యూలకు 80 మంది ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఇ.వసంతలక్ష్మి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ రవిచంద్ర, సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీటీసీ పులపర్తి చిన వెంకటలక్ష్మి, వైపీ రాజకుమార్ పాల్గొన్నారు.

కన్నులపండువగా ఉమా కొప్పేశ్వర కల్యాణం



పలివెలలో ఉమా కొప్పేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన పలివెల క్షేత్రంలో ఉమా కొప్పేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. ఎంపీపీ మార్గన గంగాధరరావు పర్యవేక్షణలో దేవస్థానం పాలకమండలి చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, ఈఓ బి.కృష్ణచైతన్య ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల విగ్రహాలను మంటపానికి తీసుకువచ్చి కల్యాణమూర్తులుగా అలంకరించారు. చైర్మన్ భమిడిపాటి దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.

మందపల్లి క్షేత్రంలో..

మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) క్షేత్రంలో ఉమా మహేశ్వరుల వార్షిక కల్యాణం, మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఏసీ, ఈఓ కె.విజయలక్ష్మి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉమా మందేశ్వర స్వామి, ఉమా బ్రహ్మేశ్వరస్వామి, ఉమా నాగేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు, సర్పంచ్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష తులసి పూజ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష తులసి పూజ జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ పర్యవేక్షించారు.

ఘనంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం

మలికిపురం: లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. కునాధ రాజు రజనీకుమార్, స్వరూపరాణి దంపతులు, నంబూరు వెంకటభరత్ వర్మ, లక్ష్మీశ్రీజ దంపతులు కల్యాణం జరిపించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

ఆలమూరు: పెదపళ్లలో ఉన్న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. మండల విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఆలయ పురోహితులు స్వామివారి కల్యాణం జరిపించారు. పట్నాల రాజేశ్వరమ్మ కుటుంబ సభ్యులు రూ.20 వేలతో చేయించిన వెండి కిరీటాలను దేవతామూర్తు విగ్రహాలకు అలంకరించారు.

సఖినేటిపల్లి: మోరి సీతారామలింగేశ్వరస్వామివారి ఆలయంలో దేవస్థానం చైర్మన్ జాన వీరభద్రప్రసాద్, సమీరకుమారి దంపతులతో స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ఘనంగా ఏర్పాట్లు



ఊబలంకలో ముస్తాబైన శివాలయం

మామిడికుదురు: మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అప్పనపల్లి మైనరురాజుగారి వీధి, సంత మార్కెట్, పాశర్లపూడిబాడవ జగతావారివీధి, మొగలికుదురు, పెదపట్నం గ్రామాల్లో ఉత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తారు. అప్పనపల్లి మైనరురాజుగారి వీధి, సంత పేటలో 10,116 జ్యోతులతో ప్రత్యేక దీపాలంకరణ, పలు రకాల పండ్లు, కూరగాయలు, పప్పు దినుసులతో తయారు చేసిన శివలింగాలను ఉత్సవాల్లో ప్రదర్శిస్తారు. అప్పనపల్లి మైనరు రాజుగారి వీధిలో ఏర్పాటు చేసేందుకు యువకులు పది కిలోల మొక్క జొన్నలు, పది కిలోల కిస్మిస్‌తో శివలింగాలను అద్భుతంగా తీర్చిదిద్దారు.

ముస్తాబైన శివాలయాలు

రావులపాలెం: ఊబలంక, రావులపాలెం, గోపాలపురం, ముమ్మిడివరప్పాడు, రావులపాడు తదితర గ్రామాల్లో శివాలయాలు సర్వాంగ సుందరంగా చలువ పందిర్లతో విద్యుద్దీపాలంకరణలతో అలంకరించారు. ఊబలంక సర్వమంగళ సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ముక్తేశ్వరం తొగరపాయ వద్ద..

అయినవిల్లి: ముక్తేశ్వరం, అయినవిల్లి, నేదునూరు, విలస, సిరిపల్లి, పోతుకుర్రు, వెలువలపల్లి, మడుపల్లి, శానపల్లిలంక, క్రాప, తొత్తరమూడి, మాగాం, వీరవల్లిపాలెం తదితర గ్రామాల్లో కొలువైన శివాలయాల్లో శివరాత్రి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముక్తేశ్వరంలోని ముక్తికాంత సమేత ముక్తేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల దర్శనం కోసం బారికేడ్లు నిర్మించారు. ముక్తేశ్వరం తొగరపాయ వద్ద భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు తొత్తరమూడి సర్పంచ్ వార జయ సావిత్రి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

అలరించిన ఏకపాత్రాభినయం

రాజోలు: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజోలు అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ప్రదర్శించిన దుర్యోధనుడి ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. న్యాయవాది యాలంగి రమేష్ దుర్యోధనుడి ఏకపాత్రాభినయం ప్రదర్శించారు. ఆలయ కమిటీ ఆయనను సత్కరించింది.

మహా శివరాత్రికి శైవ క్షేత్రాల ముస్తాబు

అంబాజీపేట: శైవ క్షేత్రాల్లో పలుచోట్ల భక్తుల కోసం చలువ పందిళ్లు నెలకొల్పుతున్నారు. మండలంలోని మాచవరం, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, ఇరుసుమండ, ముక్కామల, కముజువారిలంక, వక్కలంక, పసుపల్లి, మొసలపల్లి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, చిరతపూడి, ఇసుకపూడి, నందంపూడి, తొండవరం, వాకలగరువు గ్రామాల్లో ఉన్న శివాలయాలను రంగులతో, విద్యుద్దీపాలంకరణతో అలంకరిస్తున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.